అభివృద్ధి పనులకు దాతల సహకారం అభినందనీయం



కాగుపాడులో వంతెనను ప్రారంభిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు



కొండలరావుపాలెం కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఉంగుటూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు దాతలు సహాయసహకారం అందించడం అభినందనీయమని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. కాగుపాడులో దాతలు సాదే రాజరాజమోహన్ అందించిన రూ.8 లక్షలతో నిర్మించిన వంతెనను ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆదివారం ప్రారంభించారు. మరో దాత కడియాల జానకీ రామ్ అందించిన రూ.3 లక్షలతో నిర్మించిన కాలువరేవును ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. దాతలను ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు అభినందించారు. గ్రామ వైసీపీ నాయకులు వంకిన బారతి, దావీదు, దద్దనాల సాంబశివరావు, మట్టే వెంకటేశ్వరరావు, పెంటపాటి ఆనందరావు, చింతల కిషోర్, కొమ్మిన రాములు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ మరడ మంగరావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సర్పంచి కడియాల సుధీష్ణ, పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం దెందులూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆళ్ల బాబిని పరామర్శించిన అబ్బయ్యచౌదరి

పెదవేగి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ నేత ఆళ్ల బాబి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రామశింగవరం గ్రామానికి చెందిన వైసీపీ నేత బాబి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం విదితమే. ఆదివారం బాబి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని అబ్బయ్యచౌదరి సూచించారు. ఈ పరామర్శలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన నిలయాలు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొని దేశనాయకుల సేవలను చిన్నారులకు వివరించారు. గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన నిలయాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదవడం మాకిష్టం

పెదవేగి : నిత్యం గ్రంథ పఠనంతో విద్యార్థులకు మేధాశక్తి పెంపొందుతుందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ చెప్పారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు విద్యార్థులతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా, శరీరక వ్యాయామం, వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

క్లుప్తంగా

ఎంపీపీ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



సూర్యారావుపేటలో పాడైన పంచాయతీ మోటార్ మరమ్మతులు చేయిస్తున్న ఎంపీపీ

పెదవేగి : ఎంపీపీ చొరవతో తమ గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారమైందని సూర్యారావుపేట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెదవేగి పంచాయతీ పరిధిలోని సూర్యారావుపేటలో పంచాయతీ మోటర్ పాడైపోయి మూడు రోజులుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని, మోటార్ పాడైపోయిన రోజునే పెదవేగి సర్పంచ్‌కి తెలియజేశామని మూడు రోజులుగా ఆయన పట్టించుకోవడం లేదని సూర్యారావుపేట ప్రజలు లిఖితపూర్వకంగా పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకి తెలియజేశారు. దీనిపై ఆమె వెంటనే స్పందించి పంచాయతీ మోటార్ మరమ్మతులు చేయించి సూర్యాపేట ప్రజలకు తాగునీరు అందేలా చేశారు. దీనిపై స్థానిక ప్రజానీకం, ఎమ్మెల్యేకు, ఎంపీపీ కృతజ్ఞతలు తెలియజేశారు.

సుబ్బారావు మృతి తీరని లోటు

పెదవేగి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సుబ్బారావు లేని లోటు కుటుంబానికే కాక పార్టీకి తీరని లోటని సీనియర్ వైఎస్సార్ సీపీ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో సైదం సుబ్బారావు(60) అనారోగ్యం కారణంగా ఆదివారం మరణించారు. కొఠారు రామచంద్రరావు తదితరులు సుబ్బారావు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వీరమాచినేని నాగరాజు, బోట్ల వెంకటేశ్వరరావు, పులిచర్ల నాగరాజు, నీలం శివసత్యనారాయణ, బొప్పన కృష్ణారావు, బొప్పన రమేష్, గురజాల వెంకటేశ్వరరావు, పూస సుబ్బారావు పాల్గొన్నారు.

సుగ్రీవలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం



ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

పెదపాడు: అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని వసంతవాడలోని సుగ్రీవలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఉదయం విఘ్నేశ్వరపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం రుద్రయాగం నిర్వహించారు. ఈ పూజాక్రతువులను పండితులు సామవేదం అరుణ్‌కుమార్ శర్మ, మారుతీ శర్మ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు చావలి లలితాంబికేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాకార్యక్రమాల్లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. స్వామి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



వీఆర్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షుడు పెంటారావు

గణపవరం: రాష్ట్రంలో పనిచేస్తున్న వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని, వారికి మెరుగైన వేతనాలు ఇవ్వాలని గణపవరం మండల వీఆర్‌ఏల సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం గణపవరం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఎరిచర్ల వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల సీఐటీయూ అధ్యక్షుడు ఎం.పెంటారావు మాట్లాడుతూ వీఆర్‌ఏల కనీసవేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, వారికి అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జి.పట్టాభి, పిల్లి శ్రీనివాస్, ఆర్.నర్సయ్య పాల్గొన్నారు.

100 శాతం రుణాల వసూలు అభినందనీయం

పెదపాడు: ఆర్‌ఆర్ పేట డీసీసీబీ బ్రాంచి పరిధిలో గోగుంట సహకార సంఘం అధ్యక్షుడు బావరాజు సత్యనారాయణ, కమిటీ సభ్యులకు, సంఘ కార్యదర్శికి, సిబ్బందికి జిల్లా సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి బీ శ్రీదేవి లేఖ ద్వారా ఆదివారం అభినందలు తెలిపారు. 2023 జూన్ 30 నాటికి సభ్యుల నుంచి రావాల్సిన డిమాండ్ రుణాలు 100 శాతం వసూలు చేసినందుకు సంఘ అధ్యక్షుడు, కమిటీ సభ్యులకు, సంఘ కార్యదర్శికి, సిబ్బందికి జిల్లా సహకార బ్యాంకు తరపున హృదయ పూర్వక సహకార అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో తమ సంఘం అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నట్లు శ్రీదేవి లేఖలో పేర్కొన్నారు.

పేద వర్గాలకు లయన్స్ క్లబ్ విస్తృత సేవలు



గణపవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: పేద వర్గాలకు ఎన్నో సేవా కార్యక్రమాలను అమలుచేస్తున్న స్వచ్ఛంద సంస్థలలో లయన్స్ క్లబ్ అగ్రగామిగా ఉందని రీజియన్ ఛైర్మన్ వెల్లంకి నరేష్, సర్పంచ్ కిలారి సత్యవతి అన్నారు. గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బువ్వనపల్లి యూపీ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా రూ.కోట్ల నిధులతో సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్న లయన్స్ క్లబ్ వంటి సంస్థలకు ప్రభుత్వాలు సహకారం అందించాలన్నారు. లయన్ ఆర్‌సీ కె.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గణపవరం, నిడమర్రు మండలాల్లో ఎన్నో సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ గణపవరం లయన్స్ క్లబ్ జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈశిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఉచిత రక్తపరీక్షలు, చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు, కార్యదర్శి పాటూర్నారి సింహాచలం, బొడ్డుగిరి, ఫణి భాస్కర్, ఎస్.వాసు, ఎ.గిరిబాబు పాల్గొన్నారు.

పర్యావరణం పరిరక్షణ మొక్కలు నాటాలి

దెందులూరు: జిల్లా అంతటా పర్యావరణం పరిరక్షణ, పచ్చదనం, ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని జిల్లా గవర్నర్ జీ.మాణిక్యాలరావు, జిల్లా సేవా కోఆర్డినేటర్ చుక్కా అవినాష్‌రాజు అన్నారు. ఆదివారం పెదవేగిలో నా మొక్క– నా శ్వాస కార్యక్రమంలో భాగంగా ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ అవినాష్ రాజు ఆధ్వర్యంలో 13 రకాలకు చెందిన 5 వేల మొక్కలను విద్యార్థులకు, గ్రామస్తులకు పంపిణీ చేశారు. మొక్కలు నాటిన ప్రతి ఒక్కరూ వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా భాగస్వామ్యం ఉంటేనే సేవా కార్యక్రమాలు విజయవంతమై సత్ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు, ఉపాధ్యాయులు, నాలుగు గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

శ్రీరామవరం శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు





శ్రీరామవరం శ్మశానవాటిక ప్రవేశ ద్వారం నిర్మించిన ఆర్చి, ఇనుప గేటు, ప్రహరీ

దెందులూరు: ఏ గ్రామంలో రుద్రభూమి విశాలంగా, సౌకర్యవంతంగా ఉంటుందో ఆ గ్రామం సమస్యలు లేకుండా అభివృద్ధితో విరాజిల్లుతుందని సంస్కృతి, ఇతిహాసాలు వెల్లడిస్తున్నాయని వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరామవరం శ్మశాన అభివృద్ధి నిర్వాహకులు కామిరెడ్డి బాలు అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ సహాయ సహకారాలతో విడుదలైన జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో 80 మీటర్ల ప్రహరీ గోడ, శ్రీరామవరం గ్రామస్తుల సహకారంతో శ్మశానానికి గేటు, ఫెన్సింగ్ పనులు పూర్తయ్యాయి. శనివారం అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, కామిరెడ్డి బాలు పరిశీలించారు. శ్మశానంలో తన సొంత నిధులతో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని కామిరెడ్డి బాలు అన్నారు.

రహదారి నియమాలు పాటించాలి



హైవేపై బ్లాక్ స్పాట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బి.శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వరరావు

భీమడోలు: రహదారులపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఏలూరు డీఎస్పీ బి.శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రీయ, జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను ఆదివారం సాయంత్రం భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. పూళ్ల, పోలసానిపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించిన వాటిని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికను సంబంధిత నేషనల్ హైవే అథారిటీకి సమర్పిస్తామన్నారు. అనంతరం డీఎస్పీ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినా ఎటువంటి ప్రాణాప్రాయం లేకుండా సురక్షితంగా బయట పడవచ్చన్నారు. హైవేలపై ప్రయాణిస్తున్న వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ సంబంధిత లైన్లలో ప్రయాణించాలన్నారు. అధిక వేగంతో వెళ్లే వాహనాలు డివైడర్ పక్కగా, మధ్యస్థ వేగంతో వెళ్లే వాహనదారులు మధ్య లైన్లలో, నినాదంగా ప్రయాణించే మోటార్ వాహనాలు పూర్తిగా ఎడమ వైపునే ప్రయాణించాలన్నారు. తద్వారా ప్రమాదాలు నూరు శాతం తగ్గుతాయన్నారు. నేషనల్ హైవే వెహికల్స్ పార్కింగ్ కోసం పార్కింగ్ బేలను కేటాయించామని, నిర్ధేశించిన స్థలాల్లో హైవే వెహికల్స్‌ని పార్కింగ్ చేయడం వల్ల వాహనాల్ని ఢీకొట్టే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనచోదకులపై భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చావా సురేష్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలు బోధించాలి



ఆర్‌జేడీ విజయ భాస్కర్‌ను సన్మానిస్తున్న అపుస్మా ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవ విలువలను సైతం సందర్భానుసారం బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ సూచించారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) దెందులూరు నియోజకవర్గ స్థాయి సమావేశం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులను భయపెట్టకుండా ఇతరులతో పోల్చకుండా మంచి ఉదాహరణలతో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ప్రతి పాఠ్యాంశంలో మానవ విలువలు ఇమిడి ఉంటాయని, వాటిని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ మెదడు ఎంతో శక్తివంతమైనదని, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు మానవ మస్తిష్కం నుంచే వెలువడినవనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. దెందులూరు మండలంలోని 37 ప్రైవేట్ స్కూల్స్ నుంచి ఒక్కొక్క ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ ఉపాధ్యాయినిని ఎంపిక చేసి టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం కింద ఘనంగా సన్మానించారు. అపుస్మా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ శ్రీకాంత్, రాష్ట్ర సలహాదారు కె.సురేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు జి.బుల్లబ్బాయి, దెందులూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజ్‌కుమార్, జి.వెంకట రమణ, కోశాధికారి బి. సాయిబాబు, కార్యవర్గ సభ్యురాలు కడియాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన 1992-93 బ్యాచ్ విద్యార్థులు

పెదపాడు: పూర్వ విద్యావిద్యార్థుల అపూర్వ కలయికకు వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆదివారం ఆత్మీయ కలయిలో కలుసుకుని సందడి చేశారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. పాఠశాలలో తామంతా కలిసి ఆనాడు చేసిన చిలిపి చేష్టలు, హోమ్ వర్క్ చేయకపోతే ఉపాధ్యాయుల నుంచి ఎదురైన చీవాట్లు, కొట్టిన దెబ్బలు, మైదానంలో ఆటలాడేటప్పుడు తగిలిన దెబ్బలు, తోటి విద్యార్థులు నిక్ నేమ్‌లతో పిలుచుకున్న ఆనాటి మధుర స్మృతులను వారంతా నెమరువేసుకున్నారు. తోటి విద్యార్థులంతా ఒకచోటకు చేరుతున్నామనే ఆనందంతో ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకున్న వారంతా ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఎవరెవరు ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, పిల్లల వివరాలపై కుశల ప్రశ్నలు వేసుకున్నారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడినా వారంతా నాటి బాల్య స్నేహితులను ఒకొరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. మధ్యాహ్నం అంతా కలిసి సహపంక్తి భోజనం చేసారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వంగవీటి రంగా కృషి



వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధాకృష్ణ

పెదవేగి : దివంగత వంగవీటి మోహన రంగా ఒక కులానికి, ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే రంగా తనయుడు రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పెదవేగి మండలం అంకన్నగూడెంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మడు, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చళ్లగొళ్ళ భూస్వామి, రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు దాసరి రాము, ఏలూరు జిల్లా కాపు సంక్షేమ శాఖ అధ్యక్షుడు పులి శ్రీరాములు మొరవ నేని అబ్బులు, గంటా రామారావు, కొత్త రామకష్ణ పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

ఏలూరు (టూటౌన్): హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలు చోట్ల జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులు నడపన దానభాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై, కార్యాలయాల్లో, వ్యాపార సంస్థల్లో జాతీయ జెండా ఎరురవేసి దేశంపై గౌరవం, ప్రేమ, భక్తి చూపాలన్నారు. ఎంతోమంది మహనీయుల ప్రాణత్యాగం ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని, స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా వారందరినీ స్మరించుకుని గౌరవించడం మన కర్తవ్యమన్నారు. అలాగే సమాజం, దేశం పట్ల బాధ్యత గల పౌరులుగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల శ్రీకృష్ణ దేవరాయలు, చేకూరి గణపతి, కొప్పిశెట్టి వేణుగోపాల్, గెద్దాడ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. 9వ డివిజన్ మోటేపల్లివారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్ ఆదివారం ప్రారంభించారు. రూ.5 లక్షలతో మోటేపల్లివారి వీధి పిచ్చుకలగుండలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. పలు ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మిస్తున్నట్టు నాయకులు తెలిపారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి



భీమడోలులో వైఎస్సార్ సీపీ నేతలు ముళ్లగిరి జాన్సన్, రామకుర్తి నాగేశ్వరరావును సత్కరిస్తున్న రాష్ట్ర అధికారిణి డి.పార్వతి



పూళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ దాయం సుజాత, గ్రామస్తులు

భీమడోలు: స్వాతంత్ర్యోద్యమంలో అసువులు బాసి ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి నుంచి స్ఫూర్తి పొందాలని జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర ఫైనాన్స్ అధికారిణి డి.పార్వతీ అన్నారు. ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా భీమడోలు, పూళ్ల గ్రామాల్లో ఆదివారం నా భూమి– నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి ఆమె పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేసారు. స్తూపం వద్ద మట్టి దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడుతూ స్వతంత్ర్య సమరయోధుల పోరాటం కారణంగానే మనమంతా స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తున్నామని అన్నారు. భావితరాలకు దేశంపై మమకారాన్ని మరింత పెంచేలా నా మట్టి, నా దేశం కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన బృహత్తర కార్యక్రమాలను నిర్వహించడం చాలా సంతోషమన్నారు. అనంతరం కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించిన భీమడోలు వైసీపీ నేతలు ముళ్లగిరి జాన్సన్, రామకుర్తి నాగేశ్వరరావులు, పూళ్లకు చెందిన పారిశుధ్య కార్మికులు కృష్ణ, నాగేశ్వరరావు, ఎఎన్ఎం ప్రవీణ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దాయం సుజాత, ఏపీడీ జి.సుధాకర్, గ్రామకార్యదర్శి వైయుఎం సూర్యకుమార్, ఏపీవో కె.పద్మ పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారంపై హర్షం

దెందులూరు: కృష్ణా, గోదావరి డెల్టాల శివారు ప్రాంత ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చర్యలు చేపట్టడం హర్షణీయమని ఏపీ రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రైతు నాయకులు అన్నారు. ఆదివారం సత్యనారాయణపురం వద్ద గుండేరు వాగుపై అడ్డుకట్ట వేసి గోదావరి, ఏలూరు కాల్వకు సాగునీరు మళ్లిస్తున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు. పోణంగి పుంత కాల్వ ద్వారా ఏలూరు మండలంలో శివారు ప్రాంతాల్లో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాల్వలో గుర్రపుడెక్క, తూడు పూడికతీత పనులు చేపట్టాలని మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, కొల్లి విజయభాస్కరరెడ్డి, రైతులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చేబ్రోలులో 'గడపగడపకు'

ఉంగుటూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేబ్రోలులో సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని మంగరావు కోరారు.